కార్యరంగంలోకి కాంగ్రెస్



- గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టతకు పక్కా ప్రణాళిక
- ఇంటింటికీ రాష్ట్ర సర్కారు పథకాల ప్రచారం
- జిల్లా వ్యాప్తంగా కేడర్ విస్తరణకు వ్యూహం
- నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న కార్యవర్గ సమావేశం

నిర్మల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడేందుకు పకడ్బందీ వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా పార్టీ కేడర్‌లో నయాజోష్ నింపి వారిని క్రియాశీలకం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ప్రభుత్వం పెద్ద ఎత్తున అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు విస్తృతస్థాయిలో ప్రచారం చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వంపై గత కొద్దిరోజుల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని పెద్ద ఎత్తున దుష్ప్రచారం సాగిస్తున్నట్లు ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో పాటు మీడియాలో కూడా ఈ రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకొని రోజుకో కొత్త ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం నెలకొల్పే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. దీంతో ఇక ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను లక్ష్యంగా చేసుకుంటూ ఎదురుదాడి కొనసాగించేందుకు ఆ పార్టీ సిద్ధమవుతోంది. దీనికి అనుగుణంగానే జిల్లా కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించబోతుండడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపబోతోందని అంటున్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర పరిశీలకులు చంద్రశేఖర్‌గౌడ్, అవేజ్‌లు హాజరవుతున్నారు. ఈ సమావేశంలో పార్టీ క్రియాశీలక నేతలందరితో ఈ ఇద్దరు పరిశీలకులు సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు, ప్రతిపక్షాల వైఖరితో పాటు కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో అలాగే కేడర్‌లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేయనున్నారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ నేతలు, కేడర్ సమిష్టిగా అమలు చేయబోయే కార్యాచరణపై కూడా ఈ ఇద్దరు పరిశీలకులు దిశానిర్దేశం చేయనున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆధ్వర్యంలో జరగనున్న ఈ సమావేశంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్‌లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలతో పాటు ఇతర సీనియర్ నేతలందరు తప్పనిసరిగా హాజరు కావాలంటూ కూడా పీసీసీ ఇప్పటికు హుకుం జారీ చేసింది. ఈ సమావేశాలకు పీసీసీ అత్యంత ప్రాధాన్యతనివ్వడమే కాకుండా గైర్హాజరయ్యే నాయకుల తీరుపై కూడా వివరాలు సేకరించనుంది. భవిష్యత్‌లో పార్టీ కోసం పని చేసే నాయకులకే పూర్తిస్థాయి గుర్తింపుతో పాటు నామినేటెడ్ పదవులను కేటాయిస్తామని ఇప్పటికే పీసీసీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నేతలంతా ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేట్లు చూడాల్సిందిగా అధిష్ఠానం డీసీసీ అధ్యక్షులకు ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

సమావేశంపై అధిష్ఠానం దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తవుతున్న సందర్భంలో పార్టీ స్థితి గతులపై అంతర్గత సమీక్ష నిర్వహించుకునేందు కోసమే ఈ విస్తృతస్థాయి సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నప్పటికి ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు చేస్తూ ప్రజలను పక్కదొవ పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. దీనిని తిప్పికొట్టేందుకు క్రియాశీలక కార్యకలాపాలను ప్రారంభించాలన్న ఉద్దేశంతోనే విస్తృతస్థాయి సమావేశాలకు రూపకల్పన చేసిందని అంటున్నారు. దీని కోసంగానూ ఈ సమావేశాలను పరిశీలించేందు కోసం ప్రత్యేకంగా ఇద్దరు పరిశీలకులను నియమించి వారి ఆధ్వర్యంలో ఫీడ్ బ్యాక్ తీసుకోనున్నట్లు చెబుతున్నారు. ఇక్కడి పార్టీ నేతలందరితో సమీక్ష జరిపిన తరువాత పరిశీలకులు పార్టీ హై కమాండ్‌కు నివేదికను సమర్పించనున్నారు. ఈ నివేదిక ఆధారంగానే పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అధిష్ఠానం భవిష్యత్‌పై గుర్తింపునివ్వబోనున్నట్లు చెబుతున్నారు.

సమీకరణలో డీసీసీ ప్రసిడెంట్ బిజీ...

కాగా నిర్మల్‌తో పాటు ముథోల్ నియోజకవర్గాల్లో భిన్న ధృవాలతో పయనిస్తున్న నేతలను, సీనియర్ కార్యకర్తలందరిని ఏకతాటిపైకి తెచ్చే దిశగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు సన్నాహాలు చేస్తున్నారు. అభిప్రాయ బేధాలను పక్కన పెట్టి ప్రతిఒక్కరు విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశానికి హాజరుకావాల్సిందిగా ఆయన కోరుతున్నారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్‌లలోని ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలను ఆయన స్వయంగా ఫోన్‌లు చేసి సమావేశానికి హాజరుకావాలని కోరుతున్నారు. ఈ సమావేశాన్ని సక్సెస్ చేసి అధిష్ఠానం దృష్టిలో జిల్లా పార్టీ నేతలంతా ఐక్యంగా ఉన్నారన్న సంకేతాలను పంపాలని ఆయన లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. మాజీ మంత్రితో పాటు మాజీ ఎమ్మెల్యేలను సైతం ఆయన ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. అధిష్ఠానం కూడా డీసీసీ అధ్యక్షునికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించడంతో ఆయన ఆ దిశగా తలమునకలవుతున్నారు.

ఇక ఎదురుదాడికి సిద్ధం...

పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికి ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ దురుద్దేశంతో ప్రజలను పక్కదొవ పట్టించే విదంగా విమర్శలు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. దీని కారణంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలపై విస్తృతస్థాయిలో ప్రచారం చేస్తూ ఆ రెండు పార్టీలపై ఎదురుదాడి సాగించాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. దీనికి అనుగుణంగానే నిర్మల్‌లో మంగళవారం నిర్వహించే కీలక సమావేశంలో పార్టీ నేతలందరికి పీసీసీ పరిశీలకులు బాధ్యతలు అప్పగించనున్నారు. నేతల పనితీరు వారి కార్యశీలతను ఇక నుంచి అధిష్ఠానం పరిగణలోకి తీసుకోబోందని దీని ఆధారంగానే భవిష్యత్‌లో పదవుల కేటాయింపు, పార్టీ పరమైన గుర్తింపు లభిస్తుందన్న సంకేతాలను ఇప్పటికే అధిష్ఠానం కేడర్‌కు చేరవేసింది.

అదుపు తప్పి

ఆటోబోల్తా.. ఒకరి మృతి



సాయన్న మృతదేహం

సారంగాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కౌట్ల(బి) గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో సాయన్న(45) అనే ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ నుండి స్వర్ణ వైపు వెళ్తుండగా కౌట్ల(బి) వద్ద అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో సాయన్న అనే ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోసం 108 వాహనంలో నిర్మల్ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అసంఘటిత

కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

- మే 20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర నేత విజయలక్ష్మి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. విజయలక్ష్మి ఆరోపించారు. సోమవారం పెన్షనర్ల సంఘ భవనంలో నిర్వహించిన కార్మిక సంఘాల సన్నాహక సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రధానంగా ఆశా, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలకు పోరాటాలు చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. సుప్రీం కోర్టు తీర్పును గౌరవించడం లేదన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ... పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు లేబర్ కోడ్స్ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని వంద శాతం విదేశీపెట్టుబడులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అన్ని రంగాల కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసాచారి, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, సీఐటీయూ నాయకులు కిషన్ కుమార్, ఎం. బక్కన్న, రామలక్ష్మణ్, గంగన్న, కే. లక్ష్మీ, ఎస్. రాజేష్, హరిత, లక్ష్మణ్, సూర్యశివాజీ, ఖాజా మొయినుద్దీన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బాసరలో ఆటో ర్యాలీ

- ఎన్నికలలో ఆటోవాలాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్



బాసరలో ఆటో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

బాసర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటోవాలాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బాసరలో స్థానిక ఆటోడ్రైవర్లు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి సరస్వతీ ఆలయం ప్రధాన రహదారి మీదుగా బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది.మే 27 వ తేదిన తలపెట్టిన ఆటో ఆకలి కేకలు మహాసభలో భాగంగా రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆటోవాలాల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆటో కార్పొరేషన్ ఏర్పాటు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.మే 27న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాసభను విజయవంతం చేయాలని ఆటోవాలాలు పిలుపునిచ్చారు.

ఎల్లమ్మ చెరువును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే



ఎల్లమ్మ చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుభీర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లమ్మ చెరువు(డొడర్న గ్రామంలో) గల చెరువును సోమవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరిశీలించారు. ఎల్లమ్మ చెరువు రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాల కారణంగా కట్ట తెగిపోయింది. ఇప్పటి వరకు యధావిధిగానే రిపేర్ చేయకుండా ఉంది. దీంతో గ్రామస్థులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ఒక సారి చెరువును పరిశీలించగాలని కోరారు. ఆయన సోమవారం చెరువును పరిశీలించారు. దాదాపు 200 ఎకరాలకు ఈ చెరువు ద్వారా గ్రౌండ్‌వాటర్ లభిస్తుందని, అదే విధంగా 50 మంది గంగపుత్రులు చెరువులో చేపలు పట్టుకొని ఉపాధి పొందుతున్నారు. ఈ చెరువు కొట్టుకుపోవడంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు, గంగపుత్రులు మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. చెరువు మరమ్మతులకు దాదాపు రూ.70లక్షల వరకు వ్యయం అవుతుందని, ఎష్టిమేట్స్‌ను ప్రభుత్వానికి పంపి త్వరలో మంజూరు అయ్యేల కృషి చేస్తానని తెలిపారు. ఈయన వెంట మాజీ జెడ్పీటీసీ చౌహాన్‌శంకర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దొంతుల రాములు, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోష్, మాజీ సర్పంచ్‌లు విజయ్‌కుమార్, దేవేందర్, నాయకులు కందూర్ సాయినాథ్, రాజన్న, కల్యాణ్, బంక ఆనంద్, జావీద్, రౌఫ్, ధర్మకిరణ్, సాయినాథ్, మారుతీ, గంగాపుత్ర సంఘం అధ్యక్షులు శివాజీ, సభ్యులు ఉన్నారు.

రిసోర్స్ పర్సన్ డెమోకు హాజరుకండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో రిసోర్స్ పర్సన్లుగా దరఖాస్తు చేసుకున్నవారు మంగళవారం డెమో నిర్వహణకు హాజరు కావాలని డీఈ వో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు డీఈవో కార్యాలయంలో కమిటీ ముందు డెమో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

- కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అబినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను నివేదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీతగడువులో పరిష్కరించాలని, శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తులకు సంబంధించి వివరాలను రిమార్కుల విభాగంలో స్పష్టంగా నమోదు చేయాలని, దరఖాస్తు దారులకు పరిష్కారం గురించి సమాచారం అందించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రజలకు సహాయార్థం ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి ఫోన్ కాల్స్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి తక్షణమే పరిష్కారం చేపట్టాలని సూచించారు. దరఖాస్తు వివరాలను వాట్సాప్ ద్వారా స్వీకరించి, సమస్య నమోదుకు సంబంధించిన రసీదులను దరఖాస్తు దారులకు పంపించారు. ప్రజలు ఇంటి నుంచే 91005 77132 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి, వాట్సాప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించండి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ సదస్సులను సమగ్రంగా, సమయానుసారం నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అన్ని మండలాల తహసీల్దార్‌లతో భూ భారతి, రెవెన్యూ సదస్సులు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, వరి కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ, త్రాగునీటి సరఫరా తదితర అంశాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. గతంలో నిర్వహించిన సదస్సులు, గుర్తించిన సమస్యల వివరాలను మండలాల వారీగా తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి పంచాయతీలో గ్రామ, రెవెన్యూ సదస్సులను నిర్వహించి, భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సదస్సులో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే అన్ని మండలాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. తహసీల్దార్లంతా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు తదితర సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో జిల్లాకు వర్ష సూచన ఉన్నందున రైతులందరూ తమ ధాన్యాన్ని కాపాడుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సందర్శించి, చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించాలన్నారు. చెరువులు ఆక్రమణలు జరుగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తగినంత ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ భూ రికార్డులను స్కాన్ చేసి, డిజిటల్ రూపంలో భద్రపరచాలన్నారు. వేసవి నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సవిత, స్వాతి, ఈడీఎం నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల

రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నాం

- ఎస్పీ జానకీషర్మిల
- జిల్లా కేంద్రంలో విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు



యజమానులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేష్ మీనా

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. ఎస్పీ ఆదేశంతో సోమవారం ఏఎస్పీ రాజేష్ మీనా నేతృత్వంలో పోలీసు అధికారుల బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. విశ్వనాథ్‌పేట్, శాంతినగర్, చైన్‌గేట్, గోల్డెన్ ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లోని పాన్‌షాప్‌లను నాలుగు టీములుగా ఏర్పడి తనిఖీలు జరిపారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు జరిపిన తనిఖీల్లో పలుచోట్ల ఓటీసీ పేపర్లు దొరికినట్టు తెలిపారు. గంజాయిని ఈ పేపర్లలో చుట్టి కాల్చేందుకు వాడుతారని విచారణ జరిపి చర్య తీసుకోనున్నట్టు స్పష్టం చేశారు. జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టి బాధ్యులపై చర్య తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. స్పెషల్ తనిఖీలు చేపడతామన్నారు. డ్రగ్స్ సేవించే వారిపైనా కేసులు పెడతామన్నారు. గతంలో కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మాదక ద్రవ్యాలు విక్రయించినా, రవాణా చేసినా, సేవించినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఎస్ఐ రవి, ప్రొబిషనరీ ఎస్సై జుబేర్, సుప్రియ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో మిశ్రమ వాతావరణం

- భైంసాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత
- జిల్లా వ్యాప్తంగా సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు

ఖానాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం మిశ్రమ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం భానుడు తన ప్రతాపాన్ని చూపడంతో జిల్లాలోని భైంసాలో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం వేళ జిల్లా కేంద్రంతో పాటు ఖానాపూర్, తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. మండలం తాండ్రలో అత్యల్పంగా 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చిరుజల్లులు కురియడంతో వాతావరణం కాసేపు చల్లగా అనిపించిన తిరిగి తీవ్రమైన ఉక్కపోత వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ప్రజా ఫిర్యాదుల

విభాగానికి దరఖాస్తులు నిల్



మాట్లాడుతున్న తహసీల్దార్ సోమ శ్రీనివాస్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఎటువంటి దరఖాస్తులు రాలేదని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా తహ సీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి శాఖ నుండి ఒక ఉద్యోగి పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అధికారులు బద్రి, లక్ష్మీ, శారద, వాహిద్‌ఉద్దీన్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్ నిలిపి వేసి సైనిక బలగాలు వెనక్కి రావాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్ న్యూ డెమోక్రసీ పార్టీ నిరసన ప్రదర్శన చేపట్టింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు మాట్లాడుతూ... మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధం ఆపాలని, ఆదివాసి మావోయిస్టులపై సైనికుల దాడులు ఆపాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. హరిత, ఎస్. రాజేష్, వెంకటేష్, రాజన్న, మల్లక్క, తదితరులు పాల్గొన్నారు.

నాలా పర్మిషన్ లేకున్నా

యథేచ్ఛగా ఇంటి నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న అధికారులు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా పది మీటర్ల కంటే ఎత్తు భవనాలు, నాలా కన్వర్షన్, కమర్షియల్ భవనాలు పంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మా ణాలు చేపడుతున్నారు. మండలంలోని గ్రామ కంఠం ప్రభుత్వ భూములను కాపాడాలని వాటికి కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తే అసలు విషయం బయట పడుతుందని ప్రజలు అంటున్నారు.

గుర్తు తెలియని మృత కళేబరం లభ్యం

నేరడిగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహ కళేబరం లభించిందని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల జాతీయ రహదారి (మహిబుబ్ ఘాట్) పక్కన గుర్తుతెలియని మృత కళేబరం ఉందని పంచాయతీ కార్యదర్శి అనూష సమాచారం ఇచ్చారు. ఆ మేరకు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా గత కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉంటాడని అతని శరీర భాగాలు కుళ్ళిపోయి అవి కూడా కొన్ని పుర్రె. కాలు. నడుము బాగాల ఎముకలు మాత్రమే ఉండడంతో వాటిని సేకరించి ల్యాబ్ కు పంపడం జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఆదిలాబాద్‌లో 3 బార్లకు 61 దరఖాస్తులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ లోని మూడు బార్ల రెన్యువల్ కోసం 61 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొబిషన్ - ఎక్సైజ్ కమ్యూనిటీ హిమశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. బార్ల రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ పద్ధతిలో ఎంపిక చేసేందుకు ఈనెల 29న జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సమక్షంలో ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

'మై ఆటో ఈస్ సేఫ్' పై అవగాహన

బేల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక వారసంతలో జైనథ్ సీఐ డి.సాయినాథ్ మండల ఎస్సై దివ్య భారతితో కలిసి మై ఆటో ఈస్ సేఫ్ అనేది ప్రయాణికుల భద్రత కోసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా, ఆటోలకు క్యూ ఆర్ కోడ్ ద్వారా అనుసంధానిస్తారన్నారు. తద్వారా ప్రయాణికులు ఆటోల గురించి సమాచారం పొందవచ్చని, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

● రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని ఆటో డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల చొప్పున చెల్లిస్తామని హామీనిచ్చి మర్చిపోయారన్నారు. మే 27 వరకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. మే 27న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద నిర్వహించే కార్యక్రమాన్ని వేలాది మందితో చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ హామీ నెరవేర్చకపోవడంతో ఇప్పటికే 83 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని కోరారు. స్థానిక ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్యమైన ప్రభుత్వ ఆస్పత్రికోరిమ్స్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి ఆదిలాబాద్ జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వైద్య విద్యార్థులలో ర్యాగింగ్ నిర్వహించడం చట్ట వ్యతిరేకమని, ర్యాగింగ్ చేయడం వల్ల సున్నిత మనస్తత్వం కలవారు దేశంలో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ర్యాగింగ్‌ను ప్రోత్సహించకుండా ఉండాలని తెలిపారు. ర్యాగింగ్‌పై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. అదేవిధంగా వైద్య విద్యార్థులు డ్రగ్స్‌కు గంజాయి లాంటి పదా ర్థాలకు అలవాటు కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆధునిక భారతదేశ అభివృద్ధి వైపు పయనించాలంటే మీలాంటి విద్యావంతులు ఎంతగానో దోహదపడతారని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాలను సేవించకుండా వినియోగించకుండా ఉండాలని తెలిపారు. ఈవిటీజింగ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలకు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా ఆదిలాబాద్ షీ టీం బృందం అందుబాటులో ఉంటూ సరైన సేవలను అందజేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, రెండో పట్టణ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కరుణాకర రావు, కళాశాల డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, కళాశాల అధ్యాపకులు, ప్రొఫెసర్‌లు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనాటి ఉద్యమ స్ఫూర్తి కనిపించింది : ఎమ్మెల్యే అనిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తలమడుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల సందర్భంగా ఎల్కతుర్తి ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభ విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు తెలంగాణ ప్రజలకు బోథ్‌నియోజవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ సభలో జనం కాదు అది ప్రభంజనం అని అన్నారు. 2001లో వచ్చిన తెలంగాణ ఉద్యమ జోష్ మళ్ళీ కనిపించిందని అన్నారు. ప్రభుత్వం పోలీసులతో కలిసి ఎన్ని కుట్రలు పన్నినా, ప్రజలను సభకు రానివ్వకుండా అడ్డుకున్నా సభ వంద శాతం విజయవంతం కావడం ఒక చరిత్ర అని అన్నారు. ఈ సభతో తెలిసిపోతుంది కాంగ్రెస్ పై ప్రజలు ఎంత మండిపాటుగా ఉన్నారో అని రానున్నది ముమ్మాటికీ ప్రభుత్వమే అని అన్నారు. ఇందులో మండల తోట వెంకటేష్ జిల్లా నాయకులు మడుపు కేదారేశ్వర రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, తిరుమల గౌడ్, కిరణ్ కుమార్, మగ్గిడి ప్రకాష్, కాటిపల్లి సునీత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయిచైతన్యకు అభినందన

దట్టమైన అడవులు గుట్టల మధ్య ఊరు సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేని గ్రామంలో పుట్టి పెరిగి దేశస్థాయిలో ఆయన సాధించిన సాయి చైతన్యను ఘనంగా సన్మానించారు. అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్సి బీ తాండ గ్రామానికి చెందిన యువకులు జాదవ్ సాయి చైతన్య ఇటీవల వెలువడిన యూపీఎస్సీ ఫలితాల్లో ఆల్ ఇండియా 68వ ర్యాంక్ సాధించిన సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపు రావు, బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి తదితరులు హాజరై సాయి చైతన్యకు ఘనంగా సన్మానించారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీని బలోపేతం చేద్దాం

● బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

తలమడుగు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలం గాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీని బలోపేతం చేద్దామని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం తాంసీ, తలమడుగు మండలాల్లో పొన్నారి, కోడద్, తలమడుగు గ్రామాల్లో లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర చేరుకున్న సందర్భంగా రోడ్ షో కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ఆనాడు అగ్రకులాలు ఇడ్లీ సాంబారు గో బ్యాక్ అన్నారని ఇపుడు మన బీసీ, ఎస్సీ ఎస్టీ ప్రజలం దరం రాజకీయంగా తెలంగాణలో రెడ్డి రావులు గో బ్యాక్ అని నినాదంతో ముందుకు సాగాలన్నా రు. తెలంగాణ రాష్ట్రంలో అగ్రకులాల రాజ్యాన్ని దింపి పేద వర్గాలైన బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యాన్ని సాధించేందుకే బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలను కట్టింది తెలంగాణ నిర్మించింది దేశాన్ని నిర్మించింది బీసీ, ఎస్సీ ఎస్టీలైతే అధికారాన్ని అనుభవిస్తున్నది రెడ్డి వెలుమలు మిగతా అగ్రకులాలని ఆరోపించారు. అందుకే ఇకపై ఓటు చైతన్యం రాజకీయ చైతన్యంతో అధికారాన్ని సాధిద్దాం అందుకు సబ్బండ కులాలన్నీ ఏకం కావాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆసిలి పొచ్చాన్న(38) కుటుంబాన్ని పరామర్శించి వారికి సానుభూతి తెలియజేశారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడాలి. జిల్లా కలెక్టర్ ప్రభుత్వం బాధిత కుటుంబానికి సాయంతో పాటు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, డి.ఎస్.పి జిల్లా అధ్యక్షులు అగ్గిమల్ల గణేష్, ఉపాధ్యక్షురలు సుష్మ, శ్రీవాణి దివ్యవాణి, శ్యామల, నవీన్ రామచందర్ గంగన్న, వేణు కుమార్ మధు విష్ణు ప్రతాప్, అరవింద్, శివ, అశోక్ శివకుమార్, బీసీ ఎస్టీ ఎస్సీ నాయకులు గంధం రమణ, గడుగు గంగన్న, గంగాధర్ గౌడ్, దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మొక్కల పట్టివేత



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండలంలోని చిన్న సల్యాద గ్రామ శివారులో అక్రమంగా జొన్న పంటలో సాగుచేస్తున్న గంజాయి మొక్కలను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఇచ్చోడ సీఐ భీమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పలువురు గంజాయి సాగుచేస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గ్రామశివారులోని పంటపొలాల్లో తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని 11 ఎకరాల పంట పొలంలో నలుగురు వేర్వేరు వ్యక్తుల పొలం నుంచి 180 మొక్కలు లభించాయి. వీటి విలువ 18లక్షల వరకు ఉంటుందన్నారు. అంతర పంటగా గంజాయి సాగుచేస్తున్న చాకటి సోనేరావ్, దుర్వా జగ్గారావ్, దుర్వ లవ కుశ, అర్క జంగుబాపులపై కేసు నమోదు చేశారు. అక్రమంగా గంజాయి సాగు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు.

'విద్యార్థుల సమస్యలపై పోరాడాలి'

ఉట్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్ర సమితి అధినేత కె.చంద్రశేఖర్ రావు ఆలోచనల మేరకు విద్యార్థుల సమస్యలపై పోరాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆదేశించారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ తెలిపారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమంలో కేటీఆర్‌ను కలవడం జరిగిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు ధరణి రాజేష్ వివరించారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సంతోష్

నార్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నార్నూర్ మండల అధ్యక్షులుగా సుర్పాం సంతోష్‌ను ఎన్నిక చేసినట్లు పార్టీ మండల అధ్యక్షులు దేవరావు లొకండే తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. పదవి ఇవ్వడం తనకు ఆనందంగా ఉందన్నారు. పార్టీ నియమనిబంధనలకు కట్టుబడి ఉండి ప్రజలకు సేవలు అందిస్తామన్నారు.

తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య

ఉట్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జులాయిగా తిరుగుతున్నాడని తండ్రి మందలించడంతో నిద్రమాత్రలు మింగి కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉట్నూర్ పట్టణంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రామ్‌కుమార్ కుమారుడు సాయికుమార్ (20)ని సరిగ్గా చదువుకోలేదని, ఖాళీగా తిరుగుతున్నావని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురయ్యాడు. కుమారుడు సాయికుమార్ గత 26న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాప్రయత్నం చేశాడు. ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం ఉదయం కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించామని ఉట్నూర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగించామని ఉట్నూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మనోహర్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బీ) గ్రామానికి చెందిన గంగాధర్ అనేవ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో ఆయనకు ముఖ్య మంత్రి సహాయనిధి కింద రూ.40 వేలు మంజూరు అయిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇట్టెడి రాజురెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు అండ గా నిలుస్తుందన్నారు.

చేపల పెంపకంపై దృష్టి సారించండి



గుంతలు తవ్వుతున్న కూలీలు

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కార్యక్రమంలో కూలీలు చేపల పెంపకం కోసం అవసరమైన గుంతలను తవ్వుకోవాలని ఎంపీడీవో రమేష్, ఉపాధి హామీ ఏపీవో జగదేరావులు సూచించారు. సోమవారం మండలంలోని పట్నాపూర్, కరత్వాడ, నక్కలవాడ, లక్ష్మీపూర్, కొత్తపల్లి తదితర గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్లను పరిశీలించారు. అనంతరం కరత్వాడ చెరువులో ఉపాధిహామీ కూలీలు చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలకు పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ కార్యక్రమంలో కూలీలు చేపలు పెంపకం కోసం గుంతలను తవ్వుకోవాలన్నారు. దీంతో భవిష్యత్తులో లాభం ఉంటుందని అంతేగాక ఉపాధి కూలీలకు లాభసాటిగా ఉంటుందన్నారు. ఉపాధిహామీ పనులను చేపట్టి వేసవికాలంలో ఉపాధి పొందాలన్నారు.

సరైన ధ్రువీకరణ పత్రాలు చూడకుండా ప్రతిపాదనలు పంపవద్దు

● మీ సేవ నిర్వాహకులకు సూచించిన తహసీల్దార్

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మీసేవా కేంద్రాల ద్వారా నివాస ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలను ప్రతిపాదించే ముందు అన్ని రకాల సర్టిఫికెట్లు ఉన్నాయా లేవా అనేది మీ సేవా నిర్వాహకులు చూడాలని తహసీల్దార్ సుభాష్ చంద్ర మీసేవా నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఈ విషయమై మీసేవా నిర్వాహకులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చినవారు స్థానికంగా నివాసధృవ పత్రాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతేగాక కులధ్రువీకరణ పత్రాలు పొందేందుకు అవసరమైన పత్రాలు ఉంటేనే మీ సేవా ద్వారా ప్రతిపాదించాలని లేకుంటే తిరస్కరించాలన్నారు. అనేక గ్రామాలలో మహారాష్ట్ర నుంచి వచ్చిన వారు ఆధార్‌కార్డులు మార్పు చేసుకుంటున్నారని ఈ విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతుండడంతో వాటిలో లబ్ధి పొందినందుకు తప్పుడు ధృవీకరణ పత్రాలు పొందుతున్నారని తహసీల్దార్ సూచించారు. అంతేగాక మీసేవా కేంద్రాలలో ఏ సర్టిఫికెట్‌కు ఎంత డబ్బులు చెల్లించాలా అనేది బోర్డుపై వివరాలు ఉండాలన్నారు ఇక మీసేవా కేంద్రాలకు వచ్చే వారికి మంచినీటి సౌకర్యంతో పాటు కూర్చుని ఎందుకు కుర్చీలు నుంచి తడవకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. తప్పులు చేస్తే మీసేవా కేంద్రాల నిర్వాహకులపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా మీసేవా నిర్వాహకులు చట్టాల శ్రీకాంత్, వినోద్‌లున్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కలెక్టర్ రాజర్షిషాను సన్మానించిన నాయకులు



కలెక్టర్ రాజర్షిషాను సన్మానిస్తున్న నాయకులు



సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీస్ డే సందర్భంగా దేశ ప్రధాన మంత్రి చేతుల మీదుగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అవార్డు పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఆర్‌టీయూ తెలంగాణ ఆదిలాబాద్ జిల్లా శాఖ పక్షానా శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విఠల్‌గౌడ్, కనక అభిమాన్, శ్యామల రాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి బాబన్న, జిల్లా కోశాధికారి ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్, సంతోష్‌కుమార్, కొండు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటపర్తి ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : సివిల్ సర్వీస్ డే సందర్భంగా దేశ ప్రధానమంత్రి చేతుల మీదుగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా అవార్డు పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పీఆర్టీయూ తెలంగాణ జిల్లా శాఖ పక్షాన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆడె నూర్ సింగ్, నర్ర నవీన్ యాదవ్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు విఠల్ గౌడ్ కనక అభిమాన్, శ్యామల రాజు, జాదవ్ ప్రకాష్, దాసరి బాబన్న, ముజీబ్, సునీల్, సంతోష్, పెంటపర్తి ఊశన్న పాల్గొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామంలో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మండల కాంగ్రెస్ నాయకులు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అల్చెట్టి నాగన్న, అరిగల కిష్టయ్యమామిళ్ల భూమన్న, సత్యనారాయణ, సురేష్, నారాయణ పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వాలేగాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్

భైంసా రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాలేగాం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. రైతులు దళారులకు నమ్మవద్దని, వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్ద అమ్ముకోవాలన్నారు. ఒక క్వింటాల్ ధాన్యాన్ని రాష్ట్రప్రభుత్వం రూ. 2,320లు చెల్లిస్తుందన్నారు. ప్రతి రైతు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి రైతు పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తీసుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకవెళ్లాలన్నారు. కార్యక్రమంలో పీఏ సీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రజాక్, రమణారెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ రాజేశ్‌మీనా

ఆధ్వర్యంలో తనిఖీలు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు తిమ్మాపూర్, చాక్‌పల్లి గ్రామాల్లో సోమవారం తొమ్మిది గంటల రాత్రి నుంచి ఏకకాలంలో మూడు గ్రామాల్లో ఏఎస్పీ రాజేశ్‌మీనా తనిఖీలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామం నుంచి గంజాయి సరఫరా అవుతుందనే అనుమానం తో పోలీసులు ప్రధానకూడళ్లలో నైపై నిఘా కెమెరాలతో ఆపరేషన్ నిర్వహించారు. దిలావర్‌పూర్, నిర్మల్ టౌన్, సారం గాపూర్, నర్సాపూర్ (జి) ఎస్సైల ఆధ్వర్యంలో అనుమానితుల ఇళ్లలో, దుకాణాల్లో సోదాలు నిర్వహించారు.

భూ భారతితో రైతులకు న్యాయం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి వలన రైతులకు న్యాయం జరుగుతుందని మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

మావల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దొంగతనంలో కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని న్యూ హౌసింగ్ కాలనీలో ఈనెల 22న ఎల్.రాధిక ఇంట్లో, ఎంప్లాయ్‌కాలనీలోని జంగుబాయి ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితులు మావల పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన మావల పోలీసులు నిందితులను పట్టుకున్నారు. పట్టణంలోని రణదివ్యానగర్‌కు చెందిన కిరణ్, గాంధీనగర్‌కు చెందిన రోహిత్ అలియాస్ సమీర్‌లను సోమవారం పట్టుకుని వారి నుంచి టీవీ, ట్యాబ్, ఫోన్, తులంన్నర వెండిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాల సేకరణ



ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాంసి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను సోమవారం సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని పొన్నారి గ్రామంలో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి వాళ్ల అర్హులే నా కాదా అనే వివరాలు తెలుసుకున్నారు. ఇంటి స్థలం ఉందా లేదా అనే అంశంపై కూడా ఆరా తీశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సకాలంలో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, కార్యదర్శి గంగన్న, కారోబారి స్వామి, తదితరులు ఉన్నారు.

మిగిలిన ఆహార పదార్థాలు పశువులకు పెట్టవద్దు

గుడిహత్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పెళ్ళిలో ఏదైనా శుభకార్యంలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను పశువులకు పెట్టవద్దని మండల పశు వైద్యాధికారి కె. శ్రీకాంత్ సోమవారం పశు పోషకులకు సూచించారు. మిగిలిన ఆహార పదార్థాలు పశువులు తినడం వల్ల రూమినల్ అసిడోసిస్ అనే వ్యాధి వచ్చి పొట్ట ఉబ్బి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. శుభకార్యాలు చేసిన వారు మిగిలిన వంటకాలను దూరంగా పడేయాలని సూచించారు. అలాగే ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్తు కోతలతో ఇబ్బందులు

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ కోతలు రోజు రోజుకు తీవ్రమవుతున్నాయి. చిన్నపాటి గాలి వానకి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నాయి. రెండు రోజుల క్రితం మండలంలో ఈదురు గాలులు చిన్నపాటి వర్షం కురియడంతో దాదాపు రాత్రిపూట రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతేగాక గ్రామాలకు తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో అన్నదికారికంగా కోతలు విధిస్తున్నారు అన్న విమర్శలు వస్తున్నాయి. అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

మాజీ ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ సోయం బాపూరావు జన్మదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో ఉండే, మండల కేంద్రం నుంచి పలువురు నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బి.గంగారెడ్డితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.చంటి, మైనార్టీ నాయకులు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



[illegible]

అన్నదాతకు మళ్లీ తప్పని తరుగు తిప్పలు

● బస్తా వెంట కిలో ధాన్యం అదనంగా ఇచ్చినా.. మరో కిలో కావాలంటూ మిల్లర్ల పేచి
● ఇప్పటికే క్వింటాలుకు రెండున్నర కిలోల అదనపు తూకం ● అయినా మరో రెండున్నర కిలోల ధాన్యం దోచుకునే యత్నం
● మరో వైపు అన్నదాతను హడలెత్తిస్తున్న వాతావరణం

ఫోకస్



ఖానాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదం చేస్తున్న రైతులు



సెంటర్‌లో తలెత్తిన ఇబ్బందులను వివరిస్తున్న రైతులు

ఖానాపూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మే సమయానికి అన్నదాతకు అనునిత్యం తిప్పలు తప్పడం లేదు. ఓవైపు రైతులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ఈ యాసంగిలో ఒక లక్ష పది వేల ఎకరాల్లో వరి ధాన్యం పండించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ యాసంగిలో సుమారు ఒక లక్ష 84 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ అంచనాలకు అనుగుణంగా దిగుబడి వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. జిల్లాలో యాసంగిలో వచ్చిన ధాన్యాన్ని అన్నదాత ఎప్పటికప్పుడు విక్రయించుకునేలా జిల్లా వ్యాప్తంగా 307 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందస్తుగానే ప్రారంభించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అసలు కథ ధాన్యం కల్లాలకు చేరిన తర్వాత ప్రారంభమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తరుగు పేరిట కొనసాగిన దోపిడీనే తిరిగి ప్రస్తుతం అమలు చేసేందుకు మిల్లర్లు కొనుగోలు సెంటర్‌లో నిర్వాహకులతో కలిసి మళ్లీ కుట్రలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఖానాపూర్ మండల కేంద్రంలో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు తప్ప, తాలు పేరిట వేధింపులు మొదలయ్యాయని చెబుతున్నారు. ఈ తప్ప, తాలును అడ్డం పెట్టుకుని రైతుల నుంచి అదనపు ధాన్యాన్ని దోపిడీ చేసేందుకు తిరిగి పాత ఎత్తుగడలనే అమలు చేస్తున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు ధాన్యం దోపిడీ కోసం తూకం వేసిన లారీని సైతం రెండు రోజులుగా కొనుగోలు కేంద్రంలోనే నిలిపి వేసి ఇటు సెంటర్ నిర్వాహకులు అన్నదాతలను మరో కిలో చొప్పున ధాన్యం ఇవ్వాలని వేధిస్తున్నట్లు చెబుతున్నారు.

తరుగు పేరిట దోపిడీకి మళ్లీ యత్నాలు

రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఓ పక్క ప్రభుత్వం హెచ్చరిస్తున్న క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నదాత నిలువు దోపిడీకి గురవుతూనే ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. యాసంగిలో సాగు చేసే వరి పంట చివరి దశకు చేరుకునే వరకు ఎండలు జోరుగా ఉంటున్న కారణంగా పంటకు అందించే సాగునీటి విషయంలో కాస్త ఇబ్బందులు తలెత్తి కొంత మంది రైతులు పండించే ధాన్యంలో తప్ప, తాలు శాతం కాస్త ఎక్కువగా ఉంటుందనే సాకును అనుకూలంగా మార్చుకొని మిల్లర్లు అన్నదాతను నిండా ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఎండలు మండి పోతున్న తరుణంలో ధాన్యాన్ని జల్లెడ పట్టి ఇవ్వాలనే నిబంధన పెడుతూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో చేసే దేం లేక ఒక్కో ప్రాంతంలో రైతులు అదనంగా బస్తా ధాన్యం వెంట తరుగు పేరిట కిలో ధాన్యం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. 40 కిలోల బస్తా ధాన్యం వెంట ప్రస్తుతం 42. 1/2 కిలోల చొప్పున తూకం వేస్తున్న అన్నదాత కిక్కురు మనకుండా ధాన్యం మిల్లర్లకు అప్పగిస్తున్నారు. అయినప్పటికీ వారి దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా ఖానాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటికే బస్తా ధా న్యానికి అదనంగా ఒకటిన్నర కిలోల ధాన్యాన్ని తరుగు పేరిట అప్ప గించినప్పటికీ తిరిగి మరో కిలో ధాన్యం కావాలంటూ రైతులను ఇ బ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం తూకం వేసిన ధాన్యాన్ని తరలించేందుకు రెండు రోజుల క్రితం లారీ లలో నింపినప్పటికీ అదనంగా కిలో ధాన్యం అంటే క్వింటాల్‌కు అదనంగా మరో రెండున్నర కిలోల ధాన్యాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీని నిలిపి వేశారు. దీంతో తూకం వేయాల్సిన దానికంటే అదనంగా తాము ఇప్పటికే ఒక బస్తా వెంబడి కిలోన్నర ధాన్యాన్ని ఇచ్చేందుకు ఒప్పుకున్నామని మరో కిలో ధాన్యం అంటే ఒక బస్తాకి రెండున్నర కిలోల చొప్పున అదనపు ధాన్యం తూకం వేస్తే క్వింటాల్‌కు సుమారు 7 కిలోల వరకు ధాన్యం తరుగు పేరిట నష్ట పోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్నదాత విక్రయించే ధాన్యంలో సైతం ఏడు శాతం వరకు తప్ప, తాలు ఉండొచ్చనే నిబంధన ఉందని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ తాము క్వింటాల్‌కు ప్రస్తుతం మూడున్నర కిలోల ధాన్యం అదనంగా ఇస్తున్నామని అయినా తిరిగి తమను ఇబ్బంది పెట్టడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్ సివిల్ సప్లై డీఎంతో ఫోన్‌లో మాట్లాడుతున్న రైతులు





ఖానాపూర్‌లో రెండు రోజులుగా నిలిచిపోయిన ధాన్యం బస్తాల లారీ

ఇటీవల తేలిన తేడాను పూడ్చుకునేందుకేనా..!?

ఇటీవల జిల్లాలోని రైస్ మిల్లుల్లో జరిగిన విజిలెన్స్ దాడుల్లో ప్రభుత్వం అప్పగించిన ధాన్యంకు మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అప్పగించిన సీఎంఆర్ బియ్యం విలువకు మధ్య భారీగా తేడాలు వచ్చినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. తేడా వచ్చిన లోటును పూడ్చుకునేందుకే ఈ విధంగా తరుగు పేరిట రైతన్నను నిలువు దోపిడీ చేయాలనే ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఓ పక్క తరుగు పేరిట రైతులను మిల్లర్లు ఇబ్బందులు పెట్టడమే కాకుండా లోడింగ్ అయిన లారీలను సైతం నిలిపి వేసే ప్రక్రియతో కొన్ని సెంటర్లలో కొనుగోలు సైతం నిలిచిపోయాయి.

తగ్గుతున్న తేమ శాతం

మిల్లర్లకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు మధ్య సరైన అవగాహన కుదరని నేపథ్యంలో జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం నిలిచిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఖానాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత మూడు రోజుల క్రితం ధాన్యాన్ని తూకం వేసిన రెండు రోజుల క్రితం ధాన్యం తరలించేందుకు లారీలో లోడింగ్ సైతం చేశారు. లోడింగ్ చేసిన ధాన్యం తరలించే ముందు సెంటర్ నిర్వాహకులు రైతుల ముందు కొత్త పంచాయతీని తెరపైకి తెచ్చారు. లారీలో లోడింగ్ చేసిన ధాన్యం వెంబడి ఒక బస్తాకు అదనంగా మరో కిలో ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తేనే ధాన్యం లారీని మిల్లుకు తరలిస్తామని లేని పక్షంలో మిల్లుకు తరలించలేమని చేతులెత్తేశారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు సెంటర్ నిర్వాహకులపై సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ధాన్యం వెంటనే మిల్లుకు తరలించాలని ఇదివరకే కొనుగోలు కేంద్రంలో ఉన్న ఇతర ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఖానాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక్కొక్కరు ధాన్యం తెచ్చి సుమారు 15 రోజులు అవుతోందని దీంతో ధాన్యంలో తేమ శాతం తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన పలు ధాన్యం రాశులలో తేమ శాతం కొలిచే యంత్రంతో తేమ శాతాన్ని పరీక్షించగా కేవలం 10 శాతం మాత్రమే వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం రాగానే ధాన్యాన్ని తూకం వేయాల్సి ఉంటుందని ప్రస్తుతం 10 తేమ శాతానికి తగ్గిపోతున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం సరికాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ధాన్యాన్ని తూకం వేయకపోతే తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

హడలెత్తిస్తున్న వాతావరణం

ప్రస్తుతం వరి పంట చివరి దశకు చేరుకున్న తరుణంలో రైతన్నను వాతావరణం రెండు రోజులుగా హడలెత్తిస్తోంది. శనివారం రాత్రి చిరుజల్లులు కురిసి జిల్లా వ్యాప్తంగా రైతులను భయాందోళనకు గురిచేసిన వాతావరణం సోమవారం సాయంత్రం సైతం బెంబేలెత్తించింది. సోమవారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురవడంతో పంట కల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. పూర్తిగా ఆరిపోయి ఉండాల్సిన దానికంటే తక్కువగా తేమ శాతం వచ్చిన ధాన్యం తిరిగి వర్షానికి తడిసిపోతే దాన్ని ఆరబెట్టేందుకు మళ్లీ తిప్పలు పడాల్సి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అదనంగా మరో కిలో ధాన్యాన్ని ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు..

● బోరు బొంతల వెంకట రమణ, రైతు, తర్లపాడ్



తాను పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు ఖానాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చాను. ఇప్పటికే 40 కిలోల బస్తా వెంబడి 42.5 కిలోల చొప్పున తూకం వేశారు. తిరిగి మళ్లీ అదనంగా బస్తా వెంట మరో కిలో ధాన్యాన్ని ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు. ఇలా ఇస్తే తరుగు పేరిట క్వింటాల్‌కు 7 కిలోలు కోల్పోతాం. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

ఎట్టి పరిస్థితిలో బస్తాకు మరో కిలో ధాన్యం ఇవ్వం

● గోనెల వెంకటేష్, యువరైతు, తర్లపాడ్



ఖానాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించే ధాన్యం వెంట ఇప్పటికే తరుగు పేరిట బస్తాకు కిలోన్నర ధాన్యాన్ని అదనంగా ఇస్తున్నాము. మరో కిలో ధాన్యాన్ని అదనంగా ఇవ్వాలని రెండు రోజులుగా లారీని నిలిపి వేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఇదివరకు ఇచ్చిన అదనపు ధాన్యాన్ని మించి మరో కిలో ఇవ్వలేము. అధికారులు స్పందించి మాకు అండగా నిలవాలి.

42 కిలోలకు మించి తూకం వేస్తే చర్యలు తప్పవు

● గోపాల్, సివిల్ సప్లై డీఎం, నిర్మల్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఒక బస్తా వెంబడి 42 కిలోలకు మించి తూకం వేస్తే చర్యలు తప్పవు. ఖానాపూర్‌లో నిలిపిపోయిన లారీని వెంటనే ఏతవో అనుమతి పత్రంతో మిల్లుకు పంపించాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించాం. సంబంధిత మిల్లు యజమానితో మాట్లాడి ఎటువంటి సమస్య లేకుండా చర్యలు చేపడతాం.

కీర్తి ప్రతిష్టలే శాశ్వతం

● అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ



మహాయాగం నిర్వహిస్తున్న దంపతులు



దుర్గాప్రసాద్ స్వామిజీ ఆశీస్సులు తీసుకుంటున్న విఠల్‌రెడ్డి

కుబీర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితకాలంలో సంపాదించి న డబ్బు ఆస్తి అంతస్తులు ఏవి శాశ్వతం కావని కేవలం కీర్తి ప్రతిష్టలే శాశ్వతమని అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామిజీ భక్తులనుద్దేశించి మాట్లాడారు. వ్యసనాలకు, మందుమంసాలకు బానిస కాకుండా సాటి మనిషికి సహాయం చేస్తూ శాంతియుత జీవనం సాగించాలని సూచించారు. సోమవారం మండల కేంద్రమైన కుబీర్‌లోని విఠలేశ్వర స్వామి ఆలయం హనుమాన్ దీక్షా సేవా సమితి కుబీర్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 159వ విశ్వశాంతి అష్టోత్తర శతకుండాత్మక 108 కుండలతో హనుమాన్ మహాయజ్ఞంలో ముఖ్య అతిథిగా పాల్గొని 108 దంపతులతో మహాయజ్ఞం చేశారు. ఉదయం విఠలేశ్వర స్వామి , హనుమాన్ ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, అర్చన, నగరసంకీర్తన నిర్వహించి పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. గురుస్వాములు పుప్పాల పీరాజీ, నాగలింగం, రావుల శేఖర్, బాలాజీ, పవన్, అంజు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న ట్రైనీ కలెక్టర్ సలోని

కలెక్టర్ రాజర్షిషాను కలిసిన ట్రైనీ కలెక్టర్ సలోని

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ రాజర్షి షాను 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ట్రైనీకలెక్టర్ సలోని చాబ్రా పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. జిల్లా స్థితిగతులు, ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, పలు తాజా అంశాలపై కాసేపు చర్చించారు. జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

ఫటా..ఫట్...

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నాం

● రమేష్, ఎంపీడీవో, బోథ్



ప్రశ్న: పైలట్ గ్రామమైన కుచులాపూర్‌లో ఇండ్ల నిర్మాణం జరుగుతుందా?

జవాబు : ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నాయి.

ప్రశ్న: పైలెట్ గ్రామంలో ఎన్ని ఇండ్ల నిర్మాణం కొనసాగుతుంది.

జవాబు: పైలట్ గ్రామంలో 77 ఇండ్ల నిర్మాణం జరుగుతున్నాయి. వారి అకౌంట్లో డబ్బులు జమ చేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఎప్పుడు ఇందిరమ్మ లబ్ధిదారుల అకౌంట్లో డబ్బులు వేస్తున్నారు?

జవాబు: ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్‌లో డబ్బులు వేయడం జరుగుతుంది. బేస్మెంట్ లెవెల్ వరకు ఇల్లు పూర్తి అయితే లక్ష రూపాయలు వేయడం జరుగుతుంది.

ప్రశ్న: ఉపాధి హామీ పనులు ఎలా జరుగుతున్నాయి?

జవాబు: మండలంలో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు పనులను పర్యవేక్షిస్తున్నాం. రైతులు తమ తమ చేలలో పనులు చేపట్టారు. ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రశ్న: భూగర్భ జలాల పెంపుకు ప్రణాళికలు ఉన్నాయా?

జవాబు : భూగర్భ జలాల పెంపు కోసం రైతులు తమ బోరు బావుల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తద్వారా ఉప్పు గర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. ● (బోథ్, ఆంధ్రజ్యోతి)

బాసర ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న నిరసనల పర్వం

● సమస్యలు పరిష్కరించాలని అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెంటర్ల పోరు బాట ● రెగ్యులరైజేషన్ ప్రధాన డిమాండ్‌తో ఇరువర్గాల ఆందోళన ● విద్యార్థుల చదువుకు ఆటంకం



బాసర ఆర్జీయూకేటీ ప్రధాన ప్రవేశ ద్వారం



ఆర్జీయూకేటీ క్యాంపస్



తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

బాసర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీ నిరసనలతో హోరెత్తుతోంది. యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెంటర్లు ఆందోళన బాట పట్టారు. రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఇరు వర్గాలు పోటాపోటీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. విధులను బహిష్కరించి ఉద్యమిస్తున్నాయి. విశ్వవిద్యాలయం పరిసరాలు నిరసనల హోరుతో మారుమోగుతోంది.దీంతో విద్యార్థులు సక్రమంగా తరగతులు జరుగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కీలకమైన పరీక్షల సమయంలో అధ్యాపకులు ఉద్యమ బాట పట్టడం భవిష్యత్తు కెరీర్‌పై ప్రభావం పడుతుందని విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. తొమ్మిది వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ యూనీవర్సిటీలో సగానికి పైగా 100 మంది అధ్యాపకులు అదనపు బాధ్యతలకు, రెగ్యులర్ విధులను బహిష్కరించి నిరసన చేపట్టడం విద్యా బోధననే కాదు, పరిపాలన పరంగా కూడా పెద్ద సమస్యగా మారింది.

● **కాంట్రాక్ట్ వ్యవస్థతోనే ట్రిపుల్ ఐటీ అంకురార్పణ**

ఉమ్మడి రాష్ట్రం 2008 సంవత్సరంలో బాసరలో ఆర్జీయూకేటీ ఏర్పాటైంది. ఆనాడు పై స్థాయి నుండి కింది వరకు తాత్కాలికంగా నియమితులతోనే ప్రారంభించారు.ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది.రెండు నెలల క్రిందట వచ్చిన 25మంది జూనియర్ అసిస్టెంట్‌లు మినహాయిస్తే యూనీవర్సిటీలో 16 మంది ఉద్యోగులు మాత్రమే రెగ్యులర్‌గా నియమితులయ్యారు.మిగతా వారందరూ కాంట్రాక్ట్ ఉద్యోగులే పనిచేస్తున్నారు.ఏనాడైనా క్రమబద్ధీకరణ జరుగక పోదా అనే చిన్న ఆశతో కొనసాగుతున్నారు.

● **సమస్య అంతా ఇక్కడే**

గత బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం చెప్పినట్లు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించింది.వివిధ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరైజ్ అయ్యారు.ఉద్యోగ భద్రత ఏర్పాడింది.కానీ యూనీవర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల విషయంలో అప్పటీ ప్రభుత్వం పెండింగ్ పెట్టింది. చివరికి జూనియర్, డిగ్రీ కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ లెక్చరర్స్ సైతం కేసీఆర్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. అందరితో పాటు యూనివర్సిటీలో అమలు చేస్తే ప్రస్తుతం యూనివర్సిటీ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టాల్సిన అవసరం ఏర్పాడేది కాదు.

● **పోటాపోటీగా నిరసనలు**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే యూనీవర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేసేందుకు జీవో 21 విడుదల చేసింది.దీన్ని ఇప్పటికే కాంట్రాక్ట్ పద్ధతిలో ఏళ్ల నుంచి పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు వ్యతిరేస్తున్నారు.ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న తాము అన్యాయమవుతుందని రాష్ట్ర వ్యాప్తంగా యూనీవర్సిటీల్లో పనిచేసే 1200 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆందోళన బాట పట్టారు.ఉన్నత విద్యా మండలా కార్యాలయ ముట్టడితో మొదలైన ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ యూనీవర్సిటీలో నిరసనలు ప్రారంభించారు.సోమవారంతో 20 రోజులు అవుతోంది.మరోపక్క ఆర్జీయూకేటీలో 30 వరకు మెంటర్స్ పనిచేస్తున్నారు.వీరు కూడా కాంట్రాక్ట్ ఉద్యోగులే. అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళన చేపట్టగానే మెంటర్స్ కూడా వారం రోజుల నుంచి సమ్మె చేస్తున్నారు. ఇలా 70 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు,30 మంది మెంటర్స్ ప్రతీ రోజు నిరసన కార్యక్రమాలతో యూనివర్సిటీ ప్రాంతం ఉద్యమ వాతావారణం ఏర్పాడింది.వీరు కాకుండా అకాడమిక్ విభాగంలో 16 మంది రెగ్యులర్ ఉద్యోగులు ,మరో 50 మంది వరకు గెస్ట్ ఫ్యాకల్టీ మాత్రమే బోధన విధులకు హజారవుతున్నారు.

● **అటకెక్కిన విద్యార్థుల చదువు**

ప్రభుత్వం, ఉద్యోగుల మధ్య పోరుతో విద్యార్థులకు నష్టం జరుగుతోంది.అసలే అధ్యాపకుల కొరత తీవ్రంగా వెదిస్తుంది. గెస్ట్ ఫ్యాకాల్టీతో అధికారులు నెట్టుకాస్తున్నారు.ఈ క్రమంలో విద్యా భోదనలో నాణ్యత లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 100 మంది భోదకులు 20 రోజుల నుంచి విధులను బహిష్కరించి ఆందోళన చేస్తుంటే విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. వార్షిక పరీక్షల సమయం సెలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అధ్యాపకుల ఆందోళనతో ఉన్నవారితో ఆదరా బాదరగా సిలబస్ పూర్తిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆందోళనలు కారణంగా విద్యార్థులకు తరగతులు సరిగా జరగని పరిస్థితి నెలకొంది. ఉన్న తాత్కాలిక గెస్ట్ ఫ్యాకాల్టీకి అదనపు బాధ్యతలు, అదనంగా పనిచేయాల్సి వస్తుంది. అధ్యాపకుల ఆందోళనతో విద్యార్థులు నష్టపోతున్నారు. యూనివర్సిటీ అధికారులు ఇది ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించే సమస్యగా పరిగణించి వదిలేసినట్టు కనిపిస్తుంది.

మైనర్‌లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవు: ఎస్సై ప్రవీణ్

బోథ్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని బోథ్ ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు మైనర్లు నడుపుతున్న నాలుగు ద్విచక్ర వాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఉదయం పోలీసులు పలువురు మైనర్‌లు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లి దండులపై కేసులు తప్పవన్నారు. అంతేగాక రెండు వేల రూపాయలు జరిమానా కట్టడంతో పాటు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లవలసి ఉంటుందన్నారు ఈ విషయాన్ని గమనించి పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.



● పూర్తిగా ఎండిపోయిన లాండ సాంగ్వీ వాగు

జల గోస

- జిల్లాలో పాతాళానికి పడిపోయిన భూగర్భ జలాలు
- పల్లెలు, పట్టణాల్లోనూ తప్పని తాగునీటి తండ్లాట
- డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్న ప్రాజెక్టుల నీటిమట్టం
- సరిపడా సాగునీరు లేక ఎండిపోయిన పంటలు
- మేలో మాడు పగిలే ఎండలతో పరిస్థితులు మరింత జటిలం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీవ్రమైన నీటి ఎద్దడి సమస్య తలెత్తడంతో జనం తాగునీటి కోసం అల్లాడుతున్నారు. నిద్ర లేచినప్పటి నుంచి చిన్న పెద్ద అని తేడా లేకుండా కుటుంబమంతా నీటి కోసం గోసపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఈ ఏడు ఏప్రిల్ మాసంలోనే భూగర్భ జలాలు వేగంగా పడిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో 40 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జిల్లాలో భూగర్భజల మట్టం 9.0మీటర్లకు చేరుకుంది. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలోని పలు కాలనీలతో పాటు ఇచ్చోడ, గాదిగూడ, జైనథ్, బేల, నార్నూర్ సిరికొండ, ఇంద్రవెల్లి మండలాల్లో తాగునీటి సమస్య అధికంగా కనిపిస్తోంది. ఇప్పటికే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టిన నీటి కష్టాలు తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు. 30ఏళ్లలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడు చూడలేదని జనం వాపోతున్నారు. ప్రధానంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగు నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో స్థానిక బోరు బావులు వ్యవసాయ బావుల పైననే ఆధారపడి దాహం తీర్చుకుంటున్నారు.

నీటి ట్యాంకర్లు బిజీబిజీ..

ఆదిలాబాద్ పట్టణానికి తాగు నీటిని సరఫరా చేసే లాండ సాంగ్వీ వాగు ఏప్రిల్ మధ్యలోనే పూర్తిగా అడుగంటుకపోవడంతో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా అదిలాబాద్ పట్టణానికి 18 డీఎం ఎల్‌టీ నీరు సరఫరా అవుతుంది. అలాగే లాండ సాంగ్వీ వాగు నుంచి మరో 6 డీఎం ఎల్‌టీ నీటిని సరఫరా చేసి పట్టణ ప్రజల దాహం తీర్చేవారు. కానీ లాండ సాంగ్వీ వాగులో చుక్కనీరు అందుబాటులో లేకపోవడంతో వాగులోనే బావిని తవ్వి నీటిని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా పట్టణ శివారు కాలనీలో నీటి సమస్య తీవ్రంగా కనిపిస్తుంది. ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ విద్యానగర్ కైలాష్ నగర్ కాలనీ ఇండ్లలోని బోరు బావులు అడుగంటుకపోవడంతో నీటి ట్యాంకుల ద్వారా మంచి నీటిని కొని తెచ్చుకుంటున్నారు. కొందరైతే అద్దె రూములను ఖాళీ చేస్తూ నీటి వసతి ఉన్న కాలనీలకు వెళ్లిపోతున్నారు. ఇదే అదునుగా కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. అలాగే మారుమూల గ్రామాల్లో ఎడ్లబండ్లపై నీటి డ్రమ్ములలో వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటూ కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నీటి కోసమే సమయం కేటాయించాల్సి వస్తుందని వాపోతున్నారు.

అడుగంటిన ప్రాజెక్టులు..

రోహిణి ఎండలకు ముందే ప్రాజెక్టులు అడుగంటక పోతున్నాయి. జిల్లాలో ప్రధానంగా చెప్పుకునే సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులు రెడ్ స్టోరేజ్ కి చేరుకొంటున్నాయి. సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా ప్రస్తుతం 279.35 మీటర్లకు చేరుకుంది. అలాగే మత్తడి వాగు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా ప్రస్తుతం 270.400 మీటర్లకు చేరింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే మేలో నీటిమట్టం మరింత పడిపోయే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సాగునీటి సరఫరాను నిలిపివేసిన అధికారులు ప్రాజెక్టుల నీటిమట్టంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. చెరువులు కుంటలు వాగులు అడుగంటుకపోవడంతో తాగునీటి కోసం మూగజీవాలు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెలను నిర్మించిన ఎక్కడ నీటిని సరఫరా చేస్తున్నా పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో మురికి నీటితోనే పశువులు దాహం తీర్చుకుంటూ పలు రకాల జబ్బుల బారిన పడుతున్నాయి.

ఎటు చూసినా ఎండిన పంటలే..

పంట చేతికి వచ్చే సమయంలోనే సాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో పంటలు ఎండు ముఖం పడుతున్నాయి. జిల్లాలో యాసంగి సీజన్‌లో జొన్న మొక్కజొన్న వేరుశనగ ఇతర కూరగాయల పంటలను సాగు చేస్తారు. కానీ ఈ ఏడు వేసవిలో తొందరగానే భూగర్భ జలాలు అడుగంటడం తో సాగునీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెనుగంగా నది నీటి దారాలు కూడా ఏప్రిల్ మొదటి వారంలోనే అడుగంటకపోయాయి. దీంతో నదిపై ఆధారపడి పండించిన పంటలు సగానికి పైగా ఎండిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు. పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేసిన ప్రయోజనమే లేకుండా పోయిందని చెబుతున్నారు. కొందరు రైతులు నాలుగైదు బోరు బావులను తవ్వీనన నీటి చుక్క కనిపించక పోవడంతో పంటలను వదిలేశారు.



ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న కాలనీ వాసులు



అడుగంటుకపోయిన మత్తడి వాగు ప్రాజెక్టు

భూ భారతి చట్టంతో రైతులకు మేలు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో పొందుపరిచిన అంశాలు, హక్కులపై ప్రతిరైతు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో భూభారతి చట్టంపై అవ గాహన సదస్సు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు అరిగేల కిష్టయ్య, మామిడ్ల భూమయ్య, అనుముల సాగర్, బండి దత్తాత్రేయ యాపల్ గూడలో ఉన్న సమస్యలు పార్ట్(బీ), సాదా బైనామా తదితర సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి భూ సమస్యలు లేకుండా భూ భారతి చట్టం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. భూ భారతి చట్టంలో అటవీ, రెవెన్యూ సరిహద్దు సమస్యలను జాయింట్ సర్వే నిర్వహించి పరిష్కరించడం జరుగుతుందని, రికార్డులను తప్పులు ఉంటే సరి చేయడానికి అవ కాశం ఉందని, ముఖ్యంగా భూ భారతిలో అప్పీలు వ్యవస్థ చాలా కీలకమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, తహసీల్దార్ గోవింద్ నాయక్, ఎంపీడీఓ నాగేశ్వర్, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

● దహిగూడ పంప్ హౌస్ తనిఖీ చేసిన

మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దహిగూడ పంప్ హౌస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి మిషన్ భగీరథ నీరు అన్ని గ్రామాలకు సరఫరా అవుతున్నాయా.. మోటార్లు సరిగా పనిచేస్తున్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్ రావు, మిషన్ భగీరథ ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ ఆదిత్య, ఖండాల పంచాయితి సెక్రటరీ అనిల్ పాల్గొన్నారు.



దహిగూడ పంప్ హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

భూ భారతి ఆయుధం లాంటిది

తాంసి : రైతులకు భూభారతి ఆయుధం లాంటిది అని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భూభారతిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. భూభారతి చట్టం చాలా బాగుందని ఈ అవకాశాన్ని రైతులు సద్విని యోగపర్చుకోవాలన్నారు. చట్టంపై అందరికీ అవగాహన ఉంటేనే చట్టం పూర్తిస్థాయిలో సఫలం అవుతుందన్నారు. కీలకమైన సమస్యలపై గ్రామాల్లో చర్చ జరిపినప్పుడే ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో అర్థమవుతుందన్నారు. ఇక నుంచి ఆ కష్టాలు ఉండబోవని సూచించారు. ముఖ్యంగా త్వరితగతిన రైతుల కష్టాలు తీర్చేందుకే ప్రభుత్వం ఈ భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ సయ్యద్ బిన్ అహమ్మద్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డిసిసిబి చైర్మన్ అడిబోజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను పలువురు సన్మానించారు.

కేసీఆర్ కుటుంబం అప్పులపాలు చేసింది

● తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల చిరకాల కోరిక, సకల జనులంతా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణాను కేసీఆర్ కుటుంబసభ్యులు పందికొక్కుల్లా రాష్ట్రం మీద పడి దోచుకున్నారని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువకులు ప్రాణ త్యాగాల పునాదుల నిర్మితమైన తెలంగాణను కేసీఆర్ కుటుంబం పథకాల పేరా వేల కోట్లు దోచుకున్నారని మండి పడ్డారు. ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రజతోత్సవ సభతో మళ్ళీ తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు ఆరెల్లి రాజలింగం, జిల్లా స్వచ్ఛ భారత్ కన్వీనర్ దీపక్ సింగ్, షెకావత్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి దేవ్ పూజె, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్, శేషారావు, మండల ఉపాధ్యక్షుడు ముండే రాజేశ్వర్, మండల నాయకులు పాల్గొన్నారు.

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు

● రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బీన్ హందన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఉర్దూఅకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్య నారాయణ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొన్నారు. ముందుగా పహల్గాం దాడిలో మరణించిన వారి ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కంది శ్రీనివాస్ రెడ్డి, అడె గజేందర్, శ్యాం నాయక్, మాజీ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎమ్మె ల్యే రాథోడ్ బాపురావ్, నరేష్ జాదవ్, గోక గణేష్ రెడ్డి, ఆత్రం సుగుణ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ..

జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం హాజరైన అతిథులు నేతలంతా కలిసి పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న తాహెర్

తాంసి : తెలంగాణలో ప్రజా ప్రభుత్వమని, ప్రవేశపెట్టే పథకం ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ అన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే తమ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నేరడిగొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నేరడిగొండ మండలంలోని ఒక గ్రామంలో బాల్య వివాహం జరుగుతుందని తెలుసుకున్న అధికారులు బాల్యవివాహన్ని అడ్డుకున్నారు. బాల్య వివాహం జరుగుతుందని తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు జిల్లా బాలల సంరక్షణ సమితి చైల్డ్ హెల్ప్‌లైన్, పోలీస్ సిబ్బంది సహకారంతో జరుగుతున్న బాల్యవివాహాన్ని అడ్డుకోవడం జరిగింది. అదేవిధంగా బాల్య వివాహం వలన జరిగే అనర్థాల గురించి అమ్మాయి తల్లిదండ్రులకి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్, డిసిపియు కౌన్సిలర్ పద్మ, సోషల్ వర్కర్ రవికాంత్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



సీఎస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుని జిల్లా ఎమ్మెల్యే పాయల్ శంకర్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఆదిలాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు.

యువకుడిపై కేసు నమోదు

భీంపూర్ , ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం అర్లి(టీ) నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు నిపాని వద్ద ఆపలేదని పింటు అనే యువకుడు రాయితో కొట్టాడు. అద్దం పగిలిపోగా, లక్ష్మి అనే ప్రయాణీకురాలికి చిన్న గాయమైంది. కేసు నమోదు చేసినట్లు భీంపూర్ ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్‌కు డీజీపీ ప్రశంస



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరిస్తూ మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఆదిలాబాద్‌లో సోమవారం కానిస్టేబుల్ శ్రీనివాసు ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. జిల్లాలో గంజాయి నిర్మూలన శ్రీనివాస్ కృషిచేయడంతో రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి, లాఅండ్ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఐటీడీఏ పీఓ కుష్బూగుప్తా



అర్జీదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బూగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. పెంబి మండలం గుమ్మనా గ్రామానికి చెందిన టికం భీంరావ్ తమ గ్రామానికి రోడ్డుసౌకర్యం కల్పించాలని, తాండూర్ మండలం కిష్టపట గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ ఆర్ఓ ఎఫ్ఆర్ పట్టా మంజూరు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గిరిజనదర్బార్‌లో ఏవో దామోదర స్వామి, ఏపీవో పీవీ టీజీ మెస్రం మనో హర్, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్‌కుమార్, మేనేజర్ శ్యామల డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలకు పరిపాలించే సత్తాలేదు

● మాజీమంత్రి జోగురామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన ఆదరణ చూడలేకనే రాష్ట్ర మంత్రులు మాజీ సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, వారికి పరిపాలించే సత్తాలేదని మాజీమంత్రి జోగురామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులకు పొగరెందుకు అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, దాన్ని మాజీ సీఎం సభలో ప్రస్తావిస్తే కాంగ్రెస్ నేతలకు మింగుడు పడలేదన్నారు. కార్యక్రమంలో అలాల్ అజయ్, ఆశ్రాఫ్, మెట్టు ప్రహ్లాద్, గండ్రత్ రమేష్, మార్శెట్టి గోవర్ధన్, రాజన్న, సేవ్వా జగదీష్, సాజితుద్దీన్, బట్టు సతీష్, వేణు యాదవ్ పాల్గొన్నారు.

కర్రెగుట్టలో పోలీస్ కూంబింగ్ నిలిపివేయాలి

● శాంతి చర్చల కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న శాంతి చర్చల కమిటీ నాయకులు

ఉట్నూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చర్చలకు సానుకూలంగా స్పందిస్తే తాము కూడా చర్చలకు సిద్ధమేనని సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రకటించినందున కేంద్ర ప్రభుత్వం కర్రెగుట్టలో చేపట్టిన కూంబింగ్‌ను నిలిపివేయాలని శాంతి చర్చల కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఆత్రం భుజంగరావు, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ బానోత్ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉగ్రవాదచర్యలను పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో జరిగిన విషాదకరణ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కగార్ అంతర్యుద్ధంను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు. సమావేశంలో నేతవత్ రాందాస్, బండి విజయకుమార్, దిలేష్ చౌహాన్, జాదవ్‌రామ్ కిషన్‌నాయక్, పవర్ గంగారాం నాయక్ పాల్గొన్నారు.

జిల్లాలో నకిలీ నివాస ధ్రువపత్రాల దందా



ఇస్లాంనగర్ గ్రామం

ఇచ్చోడ, ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నకిలీ నివాస ధ్రువపత్రాల దందా ఆలస్యంగా వెలుగులోకి రావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దేశ సరిహద్దుల్లో రక్షణ శాఖ ఆధీనంలో పనిచేసే సెంట్రల్ ఫోర్స్‌లో చేరేందుకు కొందరు అభ్యర్థులు నకిలీ నివాసపత్రాలతో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తుంది. అక్రమమార్గంలో దేశభద్రత ఉద్యోగాలు పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారుల విచారణలో తెలింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో భాగంగా ఇటీవల క్షేత్రస్థాయిలో ఎస్బీ పోలీసు అధికారులు విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువపత్రాలపై సెంట్రల్ సెంట్రల్ ఇండస్ట్రీయల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకుని ఎంపికైన ముగ్గురు అభ్యర్థులపై కేసు నమోదైంది. ఏఎస్సై లక్ష్మీనారాయణ, పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఇస్లాంనగర్‌కు చెందిన సహాని సురజ్, కోకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన గజేంద్ర, దుగ్విజయ్ విసుకర్మలు ఫోర్జరీ చేసి ధ్రువపత్రాలను పొందినందున వారిపై కేసులు నమోదయ్యాయి. ఆ వ్యక్తులు తమ గ్రామస్థులు కాదని విచారణలో తేలిందన్నారు. కేవలం ఇస్లాంనగర్ గ్రామంలోనే 14 మందిఫేక్ సర్టిఫికెట్లను కలిగి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తిం చారు. అలాగే ఇంద్రవెల్లి, సిరికొండ, బేల మండలాల్లో కూడా మరిన్ని ఫేక్‌పత్రాలు ఉన్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలుస్తోంది. గతంలోనూ ఇచ్చోడలో నకిలీ కల్యాణలక్ష్మి దరఖాస్తులు వెలుగుచూశాయి.

తప్పుడు రెసిడెన్స్ సర్టిఫికెట్ పొందిన ఒకరిపై కేసు నమోదు

ఇంద్రవెల్లి : రాజస్థాన్‌లో ఉంటూ.. ఇంద్రవెల్లిలో ఉంటున్నట్లు రెవెన్యూ కార్యాలయం నుంచి తప్పుడు రెసిడెన్స్ ధృవీకరణ పత్రాలు పొందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇసాయన్న సోమవారం విలేకరులకు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మనోజ్ షెకావత్ అనే వ్యక్తి సహస్ర సీమ బాల్ (ఎస్ఎస్‌బీ)లో ఉద్యోగం కోసం 2023 సంవత్సరంలో ఇంద్రవెల్లిలో నివాస ముంటున్నట్లు కొందరు సహకారంతో రెసిడెన్స్ సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు.